మీర్‌పేట్ మేయర్‌పై అవిశ్వాసం రేపు

- 11గంటలకు ప్రత్యేక సమావేశం
- క్యాంపులో మెజారిటీ కార్పొరేటర్లు
- బహిష్కరిస్తున్నట్టు ప్రకటించిన డీసీసీ అధ్యక్షుడు

సరూర్‌నగర్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్‌పై 31 మంది కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గుతుందా.. వీగుతుందా? అన్న చర్చ నడుస్తోంది. ఈ తీర్మానంపై ప్రత్యేక సమావేశాన్ని ఈ నెల 11వ తేదీ (సోమవారం) ఉదయం 11గంటలకు మీర్‌పేట్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించనున్న కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ ప్రకటించారు. దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అవిశ్వాసం నెగ్గడానికి అవసరమైనంత బలం ఉన్నప్పటికీ.. శనివారం హఠాత్తుగా కాంగ్రెస్ పార్టీ తీసుకున్న నిర్ణయంతో డైలమా ఏర్పడింది. అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న సమావేశానికి తమ పార్టీ తరఫున గెలిచిన కార్పొరేటర్లుగానీ, ఇతర పార్టీల్లో గెలిచి తమ పార్టీలో చేరిన అనుబంధ సభ్యులుగానీ వెళ్లకూడదని ఆదేశిస్తూ రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశం బీజేపీ-బీఆర్‌ఎస్ మధ్య బల నిరూపణ వ్యవహారంగా మారినందున తమ పార్టీ ఆదేశాల మేరకు అవిశ్వాస సమావేశానికి వెళ్లకూడదని తాము నిర్ణయం తీసుకున్నట్టు ఆయన ప్రకటించారు. బీఆర్‌ఎస్‌కు చెందిన మేయర్ దుర్గాదీప్ లాల్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్, బీజేపీలకు చెందిన సభ్యులతో పాటు పలువురు బీఆర్‌ఎస్ అసంతృప్త కార్పొరేటర్లు కలిపి మొత్తం 31 మంది సభ్యులు గత నెల 22న కలెక్టర్‌కు లేఖ అందజేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్‌కు లేఖ అందజేసిన కార్పొరేటర్ల సంతకాలను వెరిఫై చేసిన అనంతరం ప్రత్యేక సమావేశం తేదీని(మార్చి 11) ప్రకటించారు. ఆర్డీవో ఇటీవల మీర్‌పేట్ మునిసిపల్ కార్యాలయాన్ని సందర్శించి సమావేశం నిర్వహించనున్న కౌన్సిల్ హాల్‌ను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై మునిసిపల్ అధికారులకు పలు సూచనలు చేసి వెళ్లారు. సోమవారం మీర్‌పేట్‌లో 144 సెక్షన్ విధించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

కాంగ్రెస్ సభ్యులు ఇద్దరే..!

ఇదిలాఉండగా మేయర్‌పై అవిశ్వాసం ప్రకటించిన 31 మంది సభ్యుల్లో మెజారిటీ సభ్యులు క్యాంపులోనే ఉన్నారు. స్థానికంగా కొంత మంది సభ్యులు మాత్రమే ఉండి పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్‌కు చెందిన 11 మంది సభ్యులు అవిశ్వాసం లేఖపై సంతకాలు పెట్టగా, మరి కొందరు సైతం అదే దారిలో నడవాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి కేవలం ఇద్దరు సభ్యులు మాత్రమే గెలువగా.. వారిద్దరూ లేఖపై సంతకాలు చేయకపోవడం గమనార్హం! ఈ క్రమంలో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు తాజాగా జారీ చేసిన ఆదేశాలు కొత్త చర్చకు దారి తీస్తున్నాయి. ఇతర పార్టీల నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన సభ్యుల సంఖ్య ఏడుకు చేరగా, వారంతా బీజేపీ, బీఆర్‌ఎస్ సభ్యులతో కలిసి అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మీర్‌పేట్‌లో మెజారిటీ బీఆర్‌ఎస్ సభ్యులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు వెనక్కి తగ్గినా.. మరో పది మంది బీఆర్‌ఎస్ సభ్యులు అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. దాంతో డీసీసీ అధ్యక్షుడు జారీ చేసిన ఆదేశాల వల్ల ఆ పార్టీకి లాభమా నష్టమా అనే చర్చ నడుస్తోంది. అవిశ్వాసానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సంపూర్ణ మద్దతు ప్రకటించి, మీర్‌పేట్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని పావులు కదుపుతున్న తరుణంలో డీసీసీ అధ్యక్షుడి ఆదేశాలు ఒకింత గందరగోళానికి దారి తీసే పరిస్థితులు కనిపిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఈ అంశం 'కేఎల్లార్ వర్సెస్ చల్లా' అన్నట్టుగా తయారయిందని వారంటున్నారు.



మీర్‌పేట్ కార్యాలయం

కొనసాగుతున్న ఉత్కంఠ

అవిశ్వాసంపై సోమవారం ఏర్పాటు చేసే ప్రత్యేక సమావేశానికి ఎంత మంది హాజరవుతారు.. హాజరైన వారిలో ఎంత మంది అనుకూలంగా చేతులెత్తుతారు.. అన్నది ఆసక్తికర అంశంగా మారింది. ఇరు వర్గాలు క్యాంపులు నిర్వహిస్తూ తమ చేతిలోని సభ్యులు జారిపోకుండా జాగ్రత్త పడుతున్నారు. అవిశ్వాసం నెగ్గి తీరుతామని కలెక్టర్‌కు లేఖ అందజేసిన సభ్యులు ధీమాగా పేర్కొంటున్నారు. మరో ఏడుగురు సభ్యులు తమకు అనుకూలంగా ఉన్నారని, తమ వద్ద ఉన్న సభ్యులను బీఆర్‌ఎస్ నేతలు మభ్యపెట్టినా.. సదరు ఏడుగురు సభ్యుల మద్దతుతో తాము గెలిచి తీరుతామని వారు పేర్కొంటున్నారు. మరోపక్క డీసీసీ అధ్యక్షుడి ఆదేశాలు దీనిపై ఏ మేరకు ప్రభావం చూపుతాయోననే ఉత్కంఠ నెలకొంది. ఇక ఏం జరుగుతుందన్నది సోమవారం మధ్యాహ్నందాకా వేచి చూడాల్సిందే..!

కొసమెరుపు

ఇటీవల ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ఆదిబట్ల మునిసిపాలిటీలో చైర్మన్‌పై కాంగ్రెస్ సభ్యులు అవిశ్వాసం ప్రకటించినప్పుడు సైతం.. అవిశ్వాస తీర్మానం సమావేశానికి కాంగ్రెస్ సభ్యులు హాజరుకావద్దని, హాజరైన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ డీసీసీ అధ్యక్షుడు చల్లా ఆదేశాలు జారీ చేశారు. కాగా సదరు సమావేశానికి కాంగ్రెస్ సభ్యులందరూ హాజరై అవిశ్వాసం నెగ్గి చైర్మన్‌ను దించేసిన సంగతి ఇక్కడ గమనార్హం!


ఎగ్జిబిషన్‌లో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆకట్టుకుంటున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ మేళా

వనస్థలిపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం ఓపెన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా ఎగ్జిబిషన్ అండ్ సేల్ విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ఎగ్జిబిషన్‌లో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి శారీస్, భాగల్‌పూర్ శారీస్, డిజైనర్ శారీస్, కాంతావర్క్స్ శారీస్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారీ శారీస్, బెంగాల్ కాటన్ శారీస్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ బ్లౌజ్, లక్నో చికెన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెల్లరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి టాయ్స్ ఇతర అనేక చేనేత ఉత్పత్తులు ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అక్బర్ అలీ మాట్లాడుతూ చేనేత కళాకారులను ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన హస్త కళా ప్రదర్శనను ఎల్బీనగర్ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పేరుగాంచిన చేనేత ఉత్పత్తులను తమ ఎగ్జిబిషన్‌లో ఉంచామన్నారు. అన్ని వర్గాల ప్రజలు కొనుగోలు చేసే విధంగా చేనేత ఉత్పత్తుల ధరలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత

చాదర్‌ఘాట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం నిరుపేద ఆడపిల్ల కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేవని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట నియోజకవర్గంలోని సైదాబాద్ మండల పరిధిలోని అమీన్‌కాలనీ, సైదాబాద్ ప్రెస్‌కాలనీ, సపోటాబాగ్, ముంతాజ్‌కాలనీ, అంబర్‌పేట మండల పరిధిలోని శంకర్‌నగర్, వాహేద్‌నగర్, చార్మినార్ మండల పరిధిలోని కమల్‌నగర్, ఫర్హత్‌నగర్, చంచల్‌గూడ, ఆజంపుర ప్రాంతాలకు చెందిన 251 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే శనివారం అందజేశారు.


కమిషనర్ అనిల్‌కుమార్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న అర్చకులు

హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన కమిషనర్

చంపాపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలోని ధ్యానాంజనేయస్వామిని శుక్రవారం రాత్రి రాష్ట్ర దేవాదాయ కమిషనర్ వి.అనిల్‌కుమార్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన కమిషనర్‌కు ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కమిషనర్ శివాలయంలో అభిషేకం చేశారు. కమిషనర్ దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలో భాగంగా ప్రజల్లో భరోసా కల్పించేక్రమంలో శనివారం ఓల్డ్‌మలక్‌పేటలో చాదర్‌ఘాట్ పోలీసుల ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ జవాన్లు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయా కాలనీల్లో ప్రధాన వీధుల గుండా పోలీసుల కవాతు కొనసాగింది. అనంతరం సీఐ సైదులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషిచేయాలి

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కలసికట్టుగా కృషిచేయాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం గాంధీభవన్‌లో ఓల్డ్‌మలక్‌పేట కాంగ్రెస్ ముఖ్యనాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సన్మానించిన వారిలో పీసీసీ జనరల్ సెక్రెటరీ బొల్లు కిషన్, మలక్‌పేట ఎ బ్లాక్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, ఓబీసీ వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ తదితరులున్నారు.

మహిళలు గెలుపు ఓటములను పట్టించుకోకుండా ముందుకు సాగాలి

- ఓయూ ప్రొఫెసర్ ప్రశాంతి ఆత్మ


లెక్చరర్లను సన్మానిస్తున్న ఓయూ ప్రొఫెసర్ ప్రశాంతిఆత్మ

చాదర్‌ఘాట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహిళలు గెలుపు ఓటములను పట్టించుకోకుండా పురుషులతో సమానంగా అధిగమించేందుకు ముందుకు సాగాలని ఓయూ ఎంబీఏ విభాగం ప్రొఫెసర్ ప్రశాంతి ఆత్మ అన్నారు. శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహిస్తూ తమ కలలను సాకారం చేసుకోవడానికి కృషి చేయాలన్నారు. కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ అప్పారావు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యారమ్స్ టోర్నమెంట్ ప్రారంభం


క్యారమ్స్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ మల్లికార్జుననగర్ కాలనీ సంక్షేమ సంఘం భవనంలో నిర్వహిస్తున్న 51వ తెలంగాణ రాష్ట్ర సీనియర్-ఇంటర్ డిస్ట్రిక్ట్ క్యారమ్స్ పోటీలను జీహెచ్ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ నెల 12వరకు పోటీలు కొనసాగుతాయని, గెలుపొందిన వారు ఏప్రిల్‌లో గ్వాలియర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికవుతారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, షేక్ ఖాదీర్, మదన్‌రాజ్, సత్యనారాయణ, వీరారెడ్డి, రాంరెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.


సత్యానగర్ హరిహర క్షేత్రంలో స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలో శివపార్వతుల కల్యాణంలో భక్తులు


కుర్మబస్తీ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ

ఘనంగా శివపార్వతుల కల్యాణం


శాలివాహననగర్‌లోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని లలిత భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శివపార్వతీల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి తలంబ్రాలు పోశారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూకుట్లపల్లి మహేందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

చంపాపేట: చంపాపేట డివిజన్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ కల్యాణంలో పట్టువస్త్రాలు అందజేశారు. ఈ కల్యాణంలో 65మంది జంటలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హస్తినాపురం డివిజన్‌లో..

హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపేట: కొత్తపేట డివిజన్‌లోని ఆలయాల్లో శుక్రవారం రాత్రి లింగోద్భవ వేళ పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్నేహపురి గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగాన్ని అన్నంతో అలంకరించారు. ఆలయంలోని స్వామివారి కల్యాణవేడుకకు పరిసర కాలనీల భక్తులు హాజరయ్యారు. అర్చకస్వాములు శ్రీనివాస్, జగదీష్, మహంకాళి రవికుమార్ వేదమంత్రాలతో స్వామివార్ల కల్యాణ వేడుకను నిర్వహించారు. కామినేని చౌరస్తా సమీపంలోని శివగంగ కాలనీలో విజయవినాయక పార్వతీదేవీ సమేత సదాశివేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట, గాయత్రీనగర్, ఎస్‌బీహెచ్‌కాలనీ ఆలయాల్లో సత్యానగర్‌లో గల హరిహర క్షేత్రంలో లింగోద్భవ సమయాన స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.


అల్మాస్‌గూడలో శివపార్వతుల విగ్రహాలను ఊరేగిస్తున్న చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి, స్థానికులు

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో..

సరూర్‌నగర్: బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని పలు కాలనీలు, గ్రామాలు, బస్తీల్లో శివపార్వతుల కల్యాణ వేడుకలను శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అల్మాస్‌గూడలోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ చైర్మన్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలను పల్లకీలో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రంతా భక్తులు అక్కడే జాగరణ చేశారు. మీర్‌పేట్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలో మహాశివరాత్రి జాగరణలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.


శివరాత్రి జాగరణలో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతతో కలిసి పూజల్లో లింగాల హరిగౌడ్


చంపాపేట డివిజన్‌లోని హనుమాన్ ఆలయంలో కల్యాణంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, ఈఓ శ్రీనివాసశర్మ


అగ్రికల్చర్‌కాలనీలో శివ పార్వతుల కల్యాణంలో ఏసీపీ కాశిరెడ్డి, కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి


చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సైదులును శనివారం చాదర్‌ఘాట్ కమల్‌నగర్ బస్తీ అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో బస్తీవాసులు అభినందించారు. కమల్‌నగర్‌లో నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇన్‌స్పెక్టర్ సైదులుకు రామస్వామి విజ్ఞప్తి చేశారు. రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని కోరారు.

- చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి


క్రీడా పోటీలను తిలకిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు

క్రీడలతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం

- జాతీయ ఉద్యానవన బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జాతీయ ఉద్యానవన బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎన్జీవోస్ కాలనీలోని చత్రపతి శివాజీ గ్రౌండ్‌లో స్వామి వివేకానంద క్రాంతి సంఘ్ నిర్వాహకులు, జాతీయ ఉద్యానవన బోర్డు డైరెక్టర్ వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో డే అండ్ నైట్ టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకుని రాణించాలన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని 36 సంవత్సరాలుగా స్వామి వివేకానంద క్రాంతి సంఘ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ యూనియన్ నాయకులు అశ్వథామరెడ్డి, కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, నాయకులు యాదగిరిరెడ్డి, శరత్‌కుమార్, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని కూలి మృతి

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కూలి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కందిగల్ గేట్ వద్ద నివాసం ఉంటున్న రాణా ప్రతాప్(22) కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కందిగల్ గేట్ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

బౌద్ధనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండురోజుల క్రితం జామై ఉస్మానియా రోడ్డు పక్కన సుమారు 30-35సంవత్సరాల యాచకుడు పడి ఉన్నాడని పోలీసులకు సమాచారమందింది. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ యాచకుడు శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు.

టార్గెట్ రూ.14.84 కోట్లు.. వసూళ్లు 8.84 కోట్లు

- 14 టీంలతో పన్ను వసూళ్లు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు
- నెలాఖరులోగా టార్గెట్ పూర్తి చేస్తాం
- పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ ఆస్తిపన్ను వసూళ్లలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్లే టార్గెట్‌గా అధికారులు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. మున్సిపల్ ఆస్తిపన్ను టార్గెట్ రూ.14.84 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 8.84 కోట్ల పన్నులు వసూళ్లు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. దీంతో పాటు 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను బకాయిదారులకు ప్రభుత్వం కల్పించిన వడ్డీపై 90 శాతం రాయితీతో రూ.1.20 కోట్లు వసూళ్లు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. 100శాతం టార్గెట్ పూర్తి చేయడంపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు అందజేసి పన్నులు వసూళ్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌తో..

2023-24 ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్‌ను పూర్తి చేసేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలో 17,396 అసెస్‌మెంట్‌లు ఉన్నాయని, పన్ను వసూళ్ల కోసం మొత్తం 14 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిషనర్‌తో పాటు ఆర్‌వో, ఇద్దరు ఆర్ఐలు, 12మంది వార్డు ఆఫీసర్లు, ఏడుగురు బిల్ కలెక్టర్లు, సిబ్బంది పనిచేస్తున్నారు. డోర్ టూ డోర్ వెళ్లి ట్యాక్సులను వసూళ్లు చేస్తున్నారు. దీంతో పాటు నేరుగా ఇంటి యజమానులకు ఫోన్ మెసెజ్‌లు, పన్నులు చెల్లించాలని ఆటోలో మైక్ ప్రచారం ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నామని అధికారులు తెలిపారు.

టార్గెట్ పూర్తి చేస్తాం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తిపన్ను వసూళ్ల టార్గెట్‌ను నెలాఖరులోగా పూర్తి చేస్తాం. ముఖ్యంగా మొండి బకాయిదారులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. దీంతో పాటుగా గత ఆర్థిక ఏడాది ఆస్తిపన్ను వడ్డీపై 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం నిర్వహిస్తున్నాం. బకాయిదారులందరు పన్ను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్ పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ


ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీసాయినగర్ కాలనీవాసులు

జీఓ నం.118 ద్వారా నష్టపోయాం.. సవరించి న్యాయం చేయండి

- నాగోల్ శ్రీసాయినగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ర్యాలీ

మన్సూరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.118 ద్వారా చేపట్టిన ఇళ్ల క్రమబద్ధీకరణలో జరిగిన లోపాలను సవరించి తమకు న్యాయం చేయాలని నాగోల్ డివిజన్ శ్రీసాయినగర్‌లో సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు, కాలనీవాసులు శనివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దయానంద్‌రెడ్డి, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జీఓ నం.118 ద్వారా తమకు అపార నష్టం జరిగిందన్నారు. గత ఎన్నికల ముందు హడావిడిగా జీవోను తీసుకువచ్చి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణ చేపట్టారని పేర్కొన్నారు. డబ్బులు చెల్లించిన వారికి కన్వేయన్స్ డీడ్ ద్వారా రిజిస్ట్రర్ చేశారన్నారు. కానీ స్టాంప్ పేపర్ మీద కాకుండా, తెల్లకాగితంపై అప్పటి ముఖ్యమంత్రి ఫొటో, ఇంటి యజమాని ఫొటో పెట్టి కన్వేయన్స్ డీడ్ ఇవ్వటం వల్ల ఎలాంటి ఉపయోగం లేకుండాపోయిందన్నారు. జీవితాంతం కష్టపడి సంపాదించుకొని లక్షలు వెచ్చించి కొనుకున్న స్థలాలు, నిర్మించుకున్న ఇళ్లను తాము ఆక్రమించుకున్నట్లుగా కన్వేయన్స్ డీడ్‌లో చూపించటం దారుణమన్నారు. బ్యాంక్ లోన్లు కూడా ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నం.118 ద్వారా తమకు నష్టం జరిగిందని, ప్రభుత్వం వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. తమకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షురాలు మంజులారెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు శ్రీనివాసాచార్యులు, నాగేంద్రప్రసాద్, లాలయ్య గౌడ్, సత్యనారాయణరెడ్డి, సూర్యప్రకాశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వీరాంజనేయులు, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.